క్లుప్తంగా

నేడే వార్డు ఉప ఎన్నిక పోలింగ్

అంబాజీపేట: మాచవరం పంచాయతీ 13వ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి శనివారం పోలింగ్ జరగనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.మంగాదేవి, ఎంపీడీఓ కె.సత్యనారాయణలు శుక్రవారం తెలిపారు. మాచవరం మెట్లకాలనీలో ఉన్న షాదీఖానాలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్‌కు ఇరువురు ప్రొసీడింగ్ అధికారులతో పాటు మరో ఆరుగురు సిబ్బందిని నియమించామన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. శాంతియుత వాతావరణంలో పోలింగ్ జరిగేలా అందరూ సహకరించాలని కోరారు.

రావులపాలెంలో..

రావులపాలెం: మండలంలోని ఊబలంక పంచాయతీ మూడో వార్డుకు శనివారం జరగనున్న ఉప ఎన్నికకు సర్వం సిద్ధం చేసినట్టు స్టేజ్–2 ఎన్నిక అధికారి పీఆర్‌సీ రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఉప ఎన్నిక జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించి ఎన్నిక ఏర్పాట్లపై సమీక్షించారు. ఉప ఎన్నిక సజావుగా సాగేందుకు ఎన్నికల సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

డ్రైడే.. ఫ్రైడే పట్ల నిర్లక్ష్యం వద్దు



డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ భరతలక్ష్మి

అంబాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డ్రై డే.. ఫ్రైడే కార్యక్రమంపై నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సక్రమంగా అమలు చేయాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ సీహెచ్‌వీ భరతలక్ష్మి అన్నారు. అంబాజీపేటలో డ్రై డే.. ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భరతలక్ష్మి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వాడకం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వాటి ద్వారా వచ్చే రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగి డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా, డెంగీ వాధ్యుల వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని వివరించాలన్నారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. డ్రై డే.. ఫ్రైడే కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్, సీహెచ్‌వో బి.అప్పారావు, పీహెచ్‌ఎన్ రత్నకుమారి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఘనంగా పాపన్నగౌడ్ జయంతి

అంబాజీపేట: మండల గౌడ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ వెనుక గౌడ నగర్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. సర్దార్ పాపన్న గౌడ్ బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు వీరిన రాంబాబు, నిచ్చెనకోళ్ల మున్నేశ్వరరావు, బొర్రా రమేష్, దాసరి చిన్న, వంకా ప్రసాద్, కోమలి సురేంద్ర పాల్గొన్నారు.

రోగికి రూ.12 వేల సాయం

సఖినేటిపల్లి: అంతర్వేది పల్లిపాలెంలో శుక్రవారం అనారోగ్యంతో ఉన్న చొప్పల ప్రభాకర్‌రావుకు వైద్య ఖర్చుల నిమిత్తం పలువురు దాతలు రూ.12 వేల సాయం పంపిణీ చేశారు. పై మొత్తాన్ని దాతలు లోకినీడి దుర్గాప్రసాద్, బొమ్మిడి దేవేందర్‌రాజు, మానుపాటి సూరిబాబు కలసి సమకూర్చారు. దీనిని మాజీ సర్పంచ్ చొప్పల చిట్టిబాబు, బాధితుడికి అందజేశారు. మాజీ సర్పంచ్ నల్లి సుభాష్ పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ల అందజేత

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో విద్యార్థులకు వాలీబాల్ కిట్ల పంపిణీ జరిగింది. ఇటీవల స్థానిక ఎస్‌టీఎస్‌ఎం హైస్కూల్ జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో సర్పంచ్ తమ్మన శ్రీనివాసు పాఠశాల విద్యార్థులకు వాలీబాల్ కిట్‌ను అందజేస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా శుక్రవారం విద్యార్థులకు ఆయన వాలీబాల్ కిట్లను అందజేశారు. విద్యార్థులకు ఇచ్చిన హామీని నిలుపుకున్న సర్పంచ్ తమ్మనను ఉపాధ్యాయ బృందం అభినందించింది.

ప్రభుత్వ రంగంలోనే కళాశాల నిర్వహించాలి

మలికిపురం: స్థానిక ఏఎఫ్‌డీటీ విద్యాసంస్థలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. కొంత కాలంగా వివాదాస్పదంగా ఉన్న కళాశాల నిర్వహణ అంశంపై రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ రాజమండ్రి ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల ప్రాంగణంలో విచారణ జరిగింది. విద్యార్థి, ప్రజాసంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, స్థానిక ప్రజలు విచారణ బృందాన్ని కలసి వినతి పత్రం అందించారు. మలికిపురంలో విచారణ జరిపిన ఆర్జేడి ప్రతినిధి కొత్తపేట ప్రిన్సిపాల్‌కి వినతి పత్రాలు అందించారు. ఈ వినతి పత్రాల సారాంశం మేరకు మలికిపురంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఏఎఫ్‌డీటీ, ఎంవీఎస్ జేఎస్ ఎండ్ ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఈ విధంగా చేయటం వలన దాతల ఆశయంతో పాటు పేద మధ్యతరగతి విద్యార్థులకు న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు.

సచివాలయాలు.. ప్రజా దేవాలయాలు

- ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు
- గ్రామాల్లోనే అన్ని సేవలు
- ప్రజలకు చేరువైన పాలన



నర్శిపూడి గ్రామ సచివాలయం

ఆలమూరు: గ్రామీణ ప్రాంత ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలను అందించాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశ వ్యాప్తంగా నీరాజనాలు అందుకుంటుంది. అనేక రాష్ట్రాలు గ్రామ సచివాలయ వ్యవస్థపై అధ్యయనం చేసేందుకు రాష్ట్రంలో పర్యటించడం సీఎం జగన్ ముందుచూపుకు అద్దం పడుతుంది. ప్రభుత్వ శాఖలన్నింటినీ ఒకే చోటకు చేర్చి ప్రజలందరికి సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలను అందించాలన్న ప్రభుత్వం ఆకాంక్ష గత మూడేళ్లలో ప్రజలకు ఎంతో చేరువయ్యింది. విలేజ్ సెక్రటేరియట్‌లుగా పిలిచే గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం పరిపాలన వికేంద్రీకరణకు నాంది పలికి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి శ్రీకారం చుట్టింది. 2019 అక్టోబర్ రెండు గాంధీ జయంతి రోజున గ్రామ సచివాలయ వ్యవస్థను సీఎం జగన్ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. రెండు వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. సచివాలయాల్లో 13 శాఖలను అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామాల్లోనే అన్ని సేవలు సచివాలయంలో అందుబాటులోకి రావడంతో మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి తప్పింది.

అన్ని సేవలు గ్రామ సచివాలయాల్లోనే..

ప్రభుత్వ సేవల కోసం గతంలో మండల కేంద్రానికి కానీ మీసేవ సెంటర్‌కు కాని వెళ్లాల్సి వచ్చేది. సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలు అనతికాలంలో ప్రజలు గుర్తించి ఆ మేరకు వినియోగించుకుంటున్నారు. నవరత్నాల్లో ప్రధానమైన పింఛన్ పంపిణీ, ఆధార్ అప్‌డేట్, అందరికీ ఇళ్లు, చేదోడు, చేయూత, మ్యుటేషన్, ఇళ్లు, భూముల రీసర్వే, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పీఎం కిసాన్, రైతు భరోసా, దీర్ఘకాలిక రోగులకు, కిడ్నీ బాధితులకు పింఛన్, రిజిస్ట్రేషన్ సేవలు తదితర సేవలు గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలు పొందుతున్నారు. అర్హతే ప్రామాణికంగా సిఫారసు లేకుండా గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సేవలందిస్తున్నారు.

ఆలమూరు మండల సమాచారమిలా..	
గ్రామ పంచాయతీలు	18
గ్రామ సచివాలయాలు	24
వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులు	16,520
ఇంత వరకు పొందిన సహాయం	రూ.48.29 కోట్లు
పింఛన్ పొందుతున్న లబ్ధిదారులు	10,858
నాలుగేళ్లలో పొందిన లబ్ధి	రూ.164.32 కోట్లు

ప్రభుత్వ పథకాలతో మహిళలకు లబ్ధి



సచివాలయాల ద్వారా అద్భుతమైన సేవలందిస్తున్నారు. ఏ పని కావాలన్నా సచివాలయానికి వెళ్తే సరిపోతుంది. గడువులోగా ఆ పని మా గ్రామంలోనే పూర్తి చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఈ విధమైన పరిస్థితి లేదు. ఏ చిన్న పనికైనా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేంది. ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన సంస్కరణలు మంచి ఫలితాలనిస్తున్నాయి.

– గుత్తుల ఉమాశ్రీ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, నర్శిపూడి

సచివాలయాలతో సమస్యలకు చెక్



ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఎంతో లబ్ధి పొందుతున్నాం. లబ్ధిదారులమైన మేము ఎక్కడకు వెళ్లకుండానే వలంటీర్ ఇంటింటికీ వెళ్లి వివరాలు తీసుకువెళ్లి అర్హులను గుర్తిస్తున్నాడు. నేను నెల నెలా పింఛన్ అందుకుంటూ మెరుగైన జీవనం సాగిస్తున్నాను. ఈ పథకాలన్నీ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారానే సాధ్యమైంది.

– ఇల్లూరి పనసరామన్న, పింఛన్ లబ్ధిదారుడు, పెదపళ్ల

ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శుక్రవారం అయినవిల్లి సచివాలయం–1లో 1, 2కు చెందిన గృహసారథులు బీమా నమోదు శిక్షణలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ సీఎం జగన్ లబ్ధి చేకూరుస్తారన్నారు. ఆయన చెప్పిన మాట చెప్పినట్లు చేయడంలో వెనుకడుగు వేయరన్నారు. గృహసారథులకు బీమా కల్పించి వారి కుటుంబానికి రక్షణగా నిలుస్తున్నారన్నారు. ఇంకా అనేక ప్రయోజనాలు అందిస్తారన్నారు. తొలుత ఎమ్మెల్యే చిట్టిబాబు అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస రావు, వైస్ ఎంపీపీ బయ్యా చిన్నబాబు, గృహసారథుల కన్వీనర్ పులిదిండి ప్రభాకర్, గుత్తుల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

ఆలమూరు: వరి రైతులంతా తప్పని సరిగా పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు కోరారు. మండలంలోని పెదపళ్లలో శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి బోసు బాబు పర్యటించారు. వరి పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అన్నదాతలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. పంట నమోదును పక్రియ, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంట నమోదులో అభ్యంతరాలు ఉంటే సత్వరమే ఆయా గ్రామాల్లోని ఆర్బీకేలో సంప్రదించాలని కోరారు. ఆలమూరు సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు కాకి నాగేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి ఎస్.లక్ష్మీలావణ్య పాల్గొన్నారు.

ర్యాలి ఆలయ అభివృద్ధికి విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన సీతంరాజు వెంకట ఉదయ్ శర్మ రూ.10,116 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది స్వామి చిత్రపటం అందజేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి



మలికిపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: రాజోలు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ఉన్నానని, ఇందుకు ఆయా ప్రాంతాల ప్రజా ప్రతినిధులు సహకారాలు అందించాలని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి అధ్యక్షతన పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే రాపాక ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎంపీడీవో ఎం.వీరాస్వామినాయుడు ఆయా శాఖల వారీగా అభివృద్ధి పనులపై సమీక్ష చేశారు. ముఖ్యమైన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి కొన్ని శాఖల అధికారులు హాజరుకాకపోవడం వల్ల తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై సమావేశంలో ఉన్న ఎమ్మెల్యే రాపాక స్పందిస్తూ, గైర్హాజరైన అధికారులకు మెమోలు ఇచ్చి, జిల్లా కలెక్టర్‌కు వారిపై ఫిర్యాదు చేయాలని ఎంపీడీవోకు, ఎమ్మెల్యే సూచించారు. కాగా తూర్పుపాలెంలో నెలకొని ఉన్న తాగునీటి సమస్యను సర్పంచ్ జి.మురళీ సత్యనారాయణ సమావేశం దృష్టికి తెచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ, గ్రామంలో సంపు నిర్మాణం పూర్తయిందని, దీని ద్వారా ఆయా ఏరియాల్లో తాగునీటి సమస్య తొలగిందని, త్వరలో అదనపు ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా ఉపాధ్యాయులు తమ పిల్లలను తాము పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తే మరింత మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరే అవకాశం ఉంటుందని పలువురు సభ్యులు పేర్కొన్నారు. పంచాయతీరాజ్ డీఈఈ శ్రీరామకృష్ణ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా పాలన



రావులపాడు గడప గడపకూలో లబ్ధిదారులకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: అభివృద్ధి సంక్షేమం రెండుకళ్లుగా రాష్ట్రంలో పాలన సాగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రావులపాడులోని పూరేటి వారి చెరువు ప్రాంతంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గడప గడపకూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి జగన్ ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి నేటి వరకు అందించిన సంక్షేమ పథకాల వివరాలను వివరించి, ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.42.50 లక్షలతో ఏర్పాటు చేయనున్న ఓవర్ హెడ్ ట్యాంక్, ఇంటింటికీ మంచినీటి కుళాయి పనులకు పూరేటి వారి చెరువులో కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ మట్టా సత్యదేవి, ఎంపీటీసీ దిడ్ల ఆశా, బాబ్జీ, కిషోర్, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, కార్యదర్శి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి



జి.పెదపూడిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై చంద్రబాబు నాయుడు, దత్త పుత్రుడు పవన్‌కల్యాణ్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని జి.పెదపూడి గ్రామంలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ దంగేటి అన్నవరం, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు మంతెన రవిరాజు, మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, నాయకులు కత్తుల విక్టర్‌బాబు, మానుకొండ నిర్మల, పెదకాపు తదితరులతో కలసి చిట్టిబాబు ఇంటింటికీ తిరిగారు. ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కుటుంబాల వారీగా జగన్ పాలనలో చేకూరిన లబ్ధిని వివరించారు. పార్టీ నాయకులు సాధనాల రమేష్, దొమ్మేటి దుర్గారావు, ఈలి చంద్రరావు, పండు, అడ్డగళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు



నార్కెడ్‌మిల్లిలో రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ,ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని నార్కెడ్‌మిల్లిలో ఆర్‌అండ్‌బీ రహదారి రూ.1.80 కోట్లతో నిర్మిస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడి రోడ్డు నిర్మాణంలో ఎక్కడా నాణ్యతలో రాజీ పడవద్దన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన తరువాత ప్రజల నుంచి స్పందన రావాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కూడా నిర్మాణానికి నోచుకోకుండా వదిలేసిన రోడ్డు పనులు నేడు ఈ ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఎప్పుటి నుంచో నిర్మించకుండా వదిలేసిన అనేక రోడ్లను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నిర్మించుకున్నామన్నారు. నియోజకవర్గంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ప్రజలకు రూ.1000 కోట్లకు పైగా ఎక్కడా అవినీతి లేకుండా అందించామన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, సర్పంచ్ పాలా నాగేశ్వరరావు, ఎంపీటీసీ వెంకటరమణ, ఆర్‌అండ్‌బీ జేఈ మణికుమార్ తదితరులు ఉన్నారు.

మోరి పీహెచ్‌సీ సందర్శన



మోరి పీహెచ్‌సీలో వైద్యులు, వైద్య సిబ్బందితో సమావేశమైన జిల్లా వైద్యాధికారి దొర

సఖినేటిపల్లి: మోరి పీహెచ్‌సీని శుక్రవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర సందర్శించారు. పీహెచ్‌సీలో పలు రికార్డులను, మందుల స్టాక్ లిస్టలను ఆయన పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు, గర్భిణులకు, టీబీ వ్యాధిగ్రస్తులకు అందుతున్న వైద్య సేవలపై పీహెచ్‌సీ వైద్యాధికారులు పూర్ణ చంద్రకుమార్, డాక్టర్ శామ్యూల్ ప్రణయ్, వైద్య సిబ్బందితో సమావేశంలో ఆయన సమీక్షించారు. అలాగే 24 గంటలూ అందుబాటులో ఉంచే పాముకాటు, కుక్కకాటు, ఇతర అత్యవసర మందులుపై కూడా వైద్యులతో చర్చించారు. అనంతరం పీహెచ్‌సీ పరిధిలోని కేశవదాసుపాలెంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ఆయన పరిశీలించారు. ఈ ప్రోగ్రాంలో దీర్ఘకాలిక రోగులకు అందిస్తున్న వైద్య సేవలను డాక్టర్ పూర్ణ చంద్రకుమార్‌తో ఆయన చర్చించారు. వెంట పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సెల్ టవర్ నిలుపుదల చేయాలి

మామిడికుదురు: పాశర్లపూడిలంక గరువులో చేపట్టిన సెల్ టవర్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ స్థానికులు శుక్రవారం అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. సెల్ టవర్ వల్ల వచ్చే రేడియేషన్ ప్రభావంతో వృద్ధులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. పచ్చదనం హరించడం, వీటితో పాటు పలు అనర్థాలు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. వీటిపై పరిశీలన చేసి సెల్‌టవర్ నిర్మాణాన్ని తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్, వినతిపత్రాలు అందజేశారు. వినతిపత్రాలు ఇచ్చిన వారిలో ఏవీవీ సత్యనారాయ ణ, ఎ.రత్న కుమారి, ఎ.నాగేశ్వరరావు, ఎ.వెంకటేశ్వరరావు, బి.బుజ్జి తదితరులు ఉన్నారు.

టీచర్ అసభ్య ప్రవర్తనపై కేసు

కొత్తపేట: విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన టీచర్‌పై కేసు నమోదు చేసినట్లు కొత్తపేట ఏఎస్సై డి.శశాంక తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తున్న ఆర్‌వీ సత్యనారాయణ ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని గత నెల 17న హెడ్ మాస్టర్ యాళ్ల చంద్రశేఖర్‌కు విద్యార్థినులు తెలిపారు. దీనిపై హెచ్‌ఎం మహిళా టీచర్లతో ఆ విద్యార్థినులను ఆరా తీయగా తాకకూడని చోట తాకినట్లు, అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలిపారు. సదరు సత్యనారాయణను వివరణ కోరగా అటువంటి పని చేయలేదని, ప్రవర్తన మార్చుకుంటానని లిఖితపూర్వకంగా రాసిచ్చాడు. ఇదిలా ఉండగా ఈనెల 7, 8, 9 తేదీల్లో పడాల చారిటబుల్ ట్రస్ట్, కృత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థినీలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు సత్యనారాయణ అనే ఉపాధ్యాయుడు మాతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడంటూ ట్రస్ట్ వారికి రాతపూర్వకంగా తెలిపారు. విద్యార్థులు చెప్పిన విషయాన్ని ఆ స్కూల్ హెచ్‌ఎంకి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జరిగిన సంఘటనపై ప్రధానోపాధ్యాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీచర్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అమ్మవార్ల ఆలయాలకు శ్రావణ శోభ



ఆలమూరులో వరలక్ష్మి అమ్మవారికి సమర్పించిన నైవేద్యం

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో తొలి శ్రావణ శుక్రవారం వేడుకలు వైభవంగా జరుపుకొన్నారు. తెలుగు లోగిళ్లు ఆధ్యాత్మికతతో నిండి పిండివంటలతో కళకళలాడాయి. వేకువజామునే పుణ్యస్నానమాచరించిన భక్తులు సమీపంలోని అమ్మవారి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో అమ్మవారి ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. అలాగే మరికొంత మంది మహిళలు ఇంట్లోనే అమ్మవారిని చక్కగా అలంకరించి నైవేద్యాలను సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. పలు ఆలయాల వద్ద నిర్వాహకులు సాంస్కృతిక, భజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

మొగలికుదురులో..

మామిడికుదురు: మొగలికుదురు గ్రామ దేవత పళ్లాలమ్మ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పలు ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. ఈ పూజల్లో పలువురు భక్తులు కర్తలుగా పాల్గొన్నారు. అమ్మవారి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక కుంకుమార్చనలు ఏర్పాటు చేశారు. అమ్మవారి వార్షికోత్సవం సందర్భంగా పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అంతర్వేదిలో

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారి ఉపాలయం వద్ద నిజ శ్రావణ మాసంలోని మొదటి శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రత కుంకుమ పూజలు మహిళా భక్తులు ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారి ఉపాలయం వద్ద ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు నేతృత్వంలో పూజలను ఏసీ ప్రారంభించారు. ఎటువంటి పూజా రుసుం లేకుండా అమ్మవారి రూపు, పూజా సామగ్రి, ప్రసాదం దేవస్థానంలో దాతల సహకారంతో ఉచితంగా సిబ్బంది అందజేశారు. పూజల అనంతరం స్వామి దర్శనం, నిత్యాన్నదాన పథకంలో భోజన వసతి దేవస్థానం ఏర్పాటు చేసింది. అధిక సంఖ్యలో మహిళలు సామూహిక వరలక్ష్మీ కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరుపుకొన్నారు. మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు కలియుగ దైవంగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి, ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పలు అమ్మవార్ల ఆలయాల్లో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

